సాక్షి ఒడిశా

గురువారం । 18 । సెప్టెంబర్ । 2025



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం బుధవారం లెక్కించారు. ఇందులో నగదు రూ.4,86,740లు, బంగారం 5 గ్రాము 340 మిల్లీగ్రాములు, వెండి 200గ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.



గూడ్స్ వ్యాగన్‌లో మంటలు

రారాయిపూర్ నుంచి విజయవాడకు బొగ్గు లోడ్‌తో వెళ్తున్న గూడ్స్ మంటల్లో చిక్కుకుంది. స్థానిక లడ్డ రైల్వే స్టేషన్ సమీపంలో బుధవారం రాత్రి ఈ ఘటన చోటు చేసుకుంది.

- 8లో



తేనెటీగల దాడి

పొలం పనులు చేసుకుని ఇంటికి తిరిగి వస్తున్న తల్లీ కూతుళ్లు తేనెటీగల దాడిలో గాయపడ్డారు. ఈ ఘటన పిందుగుడ గ్రామ సమీపంలో బుధవారం చోటు చేసుకుంది.

- 8లో

న్యూస్‌రీల్

పట్టణాన్ని కమ్మేసిన పొగమంచు



మంచుతో కప్పుకుపోయిన పట్టణంలోని ప్రధాన మార్గం

రాయగడ: రాయగడ పట్టణాన్ని బుధవారం ఉదయం పొగమంచు కమ్మేసింది. ఎనిమిది గంటల వరకు దట్టంగా కురిసిన మంచుతో పట్టణంలో చీకట్లు అలముకున్నాయి. దట్టంగా కురిసిన మంచుతో రోడ్లు కన్పించకపోవడంతో వాహనాల రాకపోకలకు కొంత ఇబ్బంది ఏర్పడింది. దీంతో వాహనాలు నడిపే సమయంలో లైట్లు వేసుకుని వెళ్లాల్సిన పరిస్థితి తలెత్తింది. చాలామంది కాలం కాని కాలంలో కురిసిన మంచును ఆస్వాదించారు.

భక్తిశ్రద్ధలతో విశ్వకర్మ పూజలు



స్వర్ణకారుల సంఘం ఆధ్వర్యంలో విశ్వకర్మ పూజలు

రాయగడ: పట్టణంలో బుధవారం విశ్వకర్మ పూజలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. స్థానిక మెయిన్ రోడ్డు వద్ద స్వర్ణకారుల సంఘం ఆధ్వర్యంలో విశ్వకర్మకు ప్రత్యేక పూజలను చేపట్టారు. అదేవిధంగా ఎలక్ట్రికల్ కాలనీల్లో విశ్వకర్మ పూజలు ఘనంగా జరిగాయి. అనంతరం భక్తులకు ప్రసాద వితరణ చేశారు.

నిరుపేదలకు ఆహార పొట్లాల పంపిణీ



పేదలకు ఆహార పొట్లాలను అందజేస్తున్న సంస్థ ప్రతినిధులు

రాయగడ: స్థానిక లయన్స్ క్లబ్ అపరాజిత సంస్థ ప్రతినిధులు పట్టణంలోని నిరుపేదలకు ఆహార పొట్లాలను బుధవారం పంపిణీ చేశారు. వివిధ ప్రాంతాల్లో వారిని గుర్తించి సంస్థ సభ్యులు అక్కడకు చేరుకుని ఆహార పొట్లాలను అందించారు. తమ సంస్థ చేపడుతున్న సేవా కార్యక్రమాల్లో భాగంగా బుధవారం దేశ ప్రధాని నరేంద్రమోదీ జన్మదినోత్సవం సందర్భంగా పేదల ఆకలి తీర్చేందుకు తమవంతు కృషి చేశామని సంస్థ కార్యదర్శి బరాటం అవంతి తెలియజేశారు. పంపిణీ కార్యక్రమంల్లో సంస్థ అధ్యక్షులు జి.రామక్రిష్ణ, కోశాధికారి పి.కల్యాణి ఉన్నారు.

15 అడుగుల నల్లత్రాచు పట్టివేత



అటవీ సిబ్బందికి చిక్కిన 15 అడుగుల నల్లత్రాచు పాము

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి జిల్లా కలిమెల సమితి లుగెల్ పంచాయతీ పరిధిలోని ఎంపీవీ-47 గ్రామంలోని ఓ వేపచెట్టు పైనుంచి భారీ నల్లత్రాచు పాము బుధవారం మధ్యాహ్న సమయంలో దిగుతూ అలజడి సృష్టించింది. దీన్ని చూసిన స్థానికులు భయంతో వణికిపోయారు. వీరిని చూసిన పాము తిరిగి చెట్టు పైకి వెళ్లిపోయింది. వెంటనే కలిమెల అటవీశాఖ సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో ఎంవీ-79 గ్రామ అటవీ శాఖ గార్డుతోపాటు మరోవ్యక్తి వచ్చి అతి కష్టంపై చెట్టూ ఎక్కి పామును పట్టుకున్నారు. దీని పొడవు 15 ఉందని అటవీ సిబ్బంది తెలిపారు. అటవీ ప్రాంతంలో ఉండాల్సి పాము ఆహారం కోసం జనావాసాల్లోకి వచ్చి చెట్టు ఎక్కిపోయి ఉంటుందని భావిస్తున్నామన్నారు. అనంతరం పామును అటవీ ప్రాంతంలో విడిచి పెట్టారు.

అర్ధరాత్రి బాంబుల మోత

- రాజధాని నగరంలో అలజడి
- పౌరులకు తప్పిన ప్రాణహాని
- దుండగుల కోసం పోలీసుల గాలింపు



సెంట్రల్ రేంజ్ ఎస్పీలతో సమావేశమైన డీఐజీ



ఘటనా స్థలంలో బ్యాగులు

భువనేశ్వర్: దేవీ నవరాత్రి ఉత్సవాలు సమీపిస్తున్న తరుణంలో రాష్ట్ర రాజధాని నగరంలో మంగళవారం అర్ధరాత్రి బాంబుల పేలుడు కలకలం రేపింది. రెండు బైకులపై వచ్చిన ఆరుగురు దుండగులు భువనేశ్వర్ నగరం నడి బొడ్డున బాంబులు రువ్వి అలజడి రేపారు. పోలీసులకు బహిరంగ సవాలు విసిరారు. బొడొగొడొ, రాజధాని పోలీస్ ఠాణా ప్రాంతాల్లో భారీగా బాంబులు విసిరి పరారయ్యారు. అయితే ఈ ఘటనలో స్వల్ప ఆస్తి నష్టం తప్ప పౌరులకు ఎటువంటి ప్రాణహాని సంభవించకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. ఈ ఘటనను జంట నగరాల కమిషనరేట్ పోలీసులు సీరియస్‌గా తీసుకున్నారు. దుండగులను ఎట్టి పరిస్థితుల్లోనూ వదిలిపెట్టబోమని గాలింపు ముమ్మరం చేశారు. రెండు పోలీస్ ఠాణాల పోలీసులు సీసీటీవీ ఫుటేజీలను తనిఖీ చేసి దుండగులను పట్టుకోవడానికి ప్రయత్నిస్తున్నారు. ఈ సంఘటన మంగళవారం రాత్రి 1.30 గంటల ప్రాంతంలో చోటుచేసుకుంది.


అప్రమత్తమైన పోలీసులు..

బొడొగొడొ పోలీస్ ఠాణా గౌతమ్ నగర్ బస్తీ, క్యాపిటల్ పోలీస్ ఠాణా ఫలికియా బస్తీపై భారీగా బాంబులు రువ్వారు. కొంతమంది ప్రత్యక్ష సాక్షుల ప్రకారం, ఆరుగురు దుండగులు రెండు బైక్‌లపై వచ్చి ఈ చర్యలకు పాల్పడినట్లు సమాచారం. తొలుత గౌతమ్ నగర్ బస్తీపై 5 బాంబులు రువ్వారు. తరువాత వారు ఫలికియా బస్తీపై మూడు బాంబులు విసిరారు. భారీ పేలుడుతో స్థానికులు భయభ్రాంతులకు గురయ్యారు. వారు వెంటనే పోలీసు కంట్రోల్ రూమ్‌కు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలం చేరే సమయానికి దుండగులు పరారయ్యారు. ఎవరిపై ప్రతీకారం తీర్చుకోవడానికి ఎవరు బాంబులు విసిరారో పోలీసులు స్పష్టం చేయలేదు. గత రెండు నెలల్లో భరత్‌పూర్ పండా కుడియా బస్తీ, పులీశ్వరి బస్తీలలో ఇలాంటి పేలుళ్లు సంభవించాయి. ఈ చర్యలు స్థానికుల్ని కలవరపరుస్తున్నాయి.

దుర్గా పూజలకు సిద్ధం..

రాష్ట్రంలో దుర్గా పూజోత్సవాల నేపథ్యంలో శాంతి భద్రతల నిర్వహణ కోసం పోలీసు ఉన్నతాధికారులు సమావేశమయ్యారు. ఈ మేరకు బుధవారం డీఐజీ సెంట్రల్ రేంజ్ పోలీసు సూపరింటెండెంట్లతో సమావేశయ్యారు. శాంతిభద్రతలను నిశితంగా పరిశీలించాలని ఎస్పీలకు ఆదేశించారు.

సైకత మోదీ



పద్మశ్రీ అవార్డు గ్రహీత, సైకత శిల్పి సుదర్శన్ పట్నాయక్ బుధవారం భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ 75వ పుట్టిన రోజు సందర్భంగా పూరీ సాగర తీరాన 750 తామర పువ్వులతో కూడిన అద్భుతమైన సైకత శిల్పాన్ని రూపొందించారు. సుమారు 6 టన్నుల ఇసుకతో 5 అడుగుల ఎత్తులో 750 తామర పువ్వులను అమర్చారు. ప్రతి ఒక్క వికసిత పద్మం మోదీ వికసిత పాలన, సేవ, నాయకత్వం, అంకితభావానికి సుగంధ ప్రతీకగా పేర్కొన్నారు. - భువనేశ్వర్

నువాపడాలో 56 కొత్త పోలింగ్ కేంద్రాలు



అఖిలపక్ష ప్రతినిధులతో సమావేశమైన సీఈఓ

భువనేశ్వర్: నువాపడా ఉప ఎన్నిక నేపథ్యంలో రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి (సీఈఓ) అఖిల పక్షాల ప్రతినిధులతో సమావేశమయ్యారు. ఎన్నికల దృష్ట్యా చేపట్టిన పలు సంస్కరణలు, సవరణలకు సంబంధించి పూర్తి వివరాలను ప్రతినిధులకు వివరించారు. త్వరలో నువాపడాలో ఉప ఎన్నిక జరగనున్న నేపథ్యంలో ప్రత్యేక సంక్షిప్త సవరణ కార్యక్రమం కింద 56 కొత్త పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు ప్రధాన ఎన్నికల అధికారి తెలిపారు. పోలింగ్ కేంద్రాల సంఖ్యను 302 నుంచి 358కి పెంచారు. పట్టణ ప్రాంతాల్లో 36 పోలింగ్ కేంద్రాలు, గ్రామీణ ప్రాంతాల్లో 322 ఉన్నట్లు పేర్కొన్నారు. నువాపడా నియోజకవర్గంలో 52 పోలింగ్ కేంద్రాల పేర్లు మార్చినట్లు ప్రకటించారు. ఈ నెల 15న అర్హత తేదీగా పరిగణించి బ్యాలెట్ పత్రాల జాబితాను సిద్ధం చేశారు. రాజకీయ పార్టీలకు బ్యాలెట్ పత్రాల జాబితాను అందుబాటులో ఉంచారు. బూత్ స్థాయి ఏజెంట్లను నియమించాలని పార్టీ ప్రతినిధులకు సూచించారు.

ఉధృతంగా కల్యాణి నది ప్రవాహం



వంతెనను తాకుతున్న వరదనీరు

రాయగడ: జిల్లాలోని కళ్యాణసింగుపూర్‌లో కళ్యాణి నది ఉధృతంగా ప్రవహిస్తోంది. మూడు రోజులుగా ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు భారీగా వరద నీరు చేరుతోంది. వంతెనకు నీరు తాకుతుండటంతో సమీప ప్రాంతాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎనిమిదేళ్ల కిందట ఇదే తరహా వరదలు రావడంతో కళ్యాణసింగుపూర్ కకావికలమైంది. ఈ నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరిస్తున్నారు.

బీజేడీ నాయకుల నిరసన



ఎస్పీ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న బీజేడీ శ్రేణులు

రాయగడ: రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా క్షీణించాయని, మహిళలపై అత్యాచారాలు పెరిగిపోతున్నాయని నిరసిస్తూ బీజేడీ శ్రేణులు బుధవారం ఆందోళనకు దిగాయి. పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి జగన్నాథ సరక ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమంలో గుణుపూర్ మాజీ ఎమ్మెల్యే రఘునాథ్ గొమాంగొ, బీజేడీ రాష్ట్ర శాఖ ఉపాధ్యక్షుడు జగదీష్ చంద్ర పాత్రో, సీనియర్ నాయకులు, జిల్లా పరిషత్ మాజీ సభ్యుడు పటాన్న గౌరీ శంకరరావు, జిల్లా పరిషత్ అధ్యక్షురాలు సరస్వతి మాఝి, రాయగడ మున్సిపల్ వైస్ చైర్మన్ శుభ్ర పండ, దేవాషీష్ ఖడంగా, సంతోష్ పాత్రొ తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఎస్పీ స్వాతి ఎస్.కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. అత్యాచారాలకు సంబంధించి సమగ్ర దర్యాప్తు జరిపి నిందితులను శిక్షించాలని కోరారు.

అసెంబ్లీ సమావేశాలకు మూడంచెల భద్రత



భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న పోలీసు ఉన్నతాధికారులు

భువనేశ్వర్: రాష్ట్ర 17వ శాసన సభ వర్షాకాల సమావేశాలు గురువారం నుంచి ఆరంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో గట్టి భద్రతా వ్యవస్థ ఏర్పాటు చేశారు. శాసన సభ వెలుపల, లోపల, పరిసరాల్లో ప్రతి కదలికపై నిఘా వేసేందుకు మూడంచెల భద్రతా వలయం సిద్ధం చేశారు. ఈ ఏర్పాట్లను రాష్ట్ర పోలీసు డైరెక్టరు జనరల్ యోగేష్ బహదూర్ ఖురానియా ప్రత్యక్షంగా సమీక్షించారు. ఎటువంటి విపత్కర పరిస్థితులు ఎదురైనా సమర్థంగా ఎదుర్కోవడానికి అనుక్షణం అప్రమత్తంగా ఉండాలని భద్రతా దళాలను ఆదేశించారు. శాసన సభ భద్రతా కార్యకలాపాల కోసం 30 ప్లాటూన్ల పోలీసులను మోహరించనున్నారు. 150 మంది ప్రత్యేక అధికారులు పరిస్థితిని ప్రత్యక్షంగా పర్యవేక్షిస్తారు. రాత్రింబవళ్లు 5 తాత్కాలిక కంట్రోల్ రూములు పని చేస్తాయి. స్ట్రైకింగ్ ఫోర్స్, బాంబు నిర్వీర్య బృందం ఈ కార్యకలాపాల్లో పాలుపంచుకుంటాయి. శాసన సభ సమీపంలోని వివిధ ప్రదేశాలలో సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేశారు. దిగువ పీఎంజీలో 144 సెక్షన్ జారీ చేయనున్నారు.

75 లక్షల మొక్కలు నాటడం లక్ష్యం



ఏక్ పేడ్ మా కే నామ్ కార్యక్రమం కింద మొక్క నాటిన సీఎం మోహన్‌చరణ్ మాఝి



స్వచ్ఛ భారత్‌లో పాల్గొన్న సీఎం



రక్తదాన శిబిరం నిర్వహిస్తున్న దృశ్యం

భువనేశ్వర్: భారత ప్రధాని నరేంద్ర మోదీ 75వ పుట్టిన రోజు పురస్కరించుకుని ముఖ్యమంత్రి మోహన్‌చరణ్ మాఝి రాష్ట్ర వ్యాప్తంగా 75 లక్షల మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ జన్మదిన కానుకగా ఈ కార్యక్రమం చేపట్టడం విశేషం. ఈ సందర్భంగా స్థానిక ఏకామ్ర కళాశాల ప్రాంగణంలో ఏక్ పేడ్ మా కే నామ్ కార్యక్రమం కింద మొక్కలు నాటారు. పుడమి తల్లి పరిరక్షణకు కృతజ్ఞతపూర్వకంగా ప్రతిఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలనే ప్రధాని పిలుపునకు స్పందిద్దామని సీఎం పేర్కొన్నారు. ఈ కార్యాచరణ ప్రధాని మోదీకి అమూల్యమైన జన్మదిన కానుకగా నిలుస్తుందన్నారు. అనంతరం పార్టీ సీనియర్ నాయకులతో కలిసి ముఖ్యమంత్రి రక్తదాన శిబిరంలో పాల్గొన్నారు. రక్తదానం మానవాళికి ఉత్తమ సేవగా పేర్కొన్నారు.

పరిశుభ్రతతో ఆరోగ్యానికి భద్రత



స్వచ్ఛ అభియాన్ కార్యక్రమంలో గవర్నర్ డాక్టర్ కంభంపాటి హరిబాబు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

భువనేశ్వర్: పరిసరాల పరిశుభ్రత జీవితంలో ఓ భాగం కావాలని రాష్ట్ర గవర్నర్ డాక్టర్ కంభంపాటి హరిబాబు అన్నారు. బుధవారం స్థానిక రమాదేవి మహిళా విశ్వవిద్యాలయంలో స్వచ్ఛత అభియాన్ ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనారోగ్య సమస్యలను నివారించడంలో పరిసరాల పాత్ర కీలకమన్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి క్యాంపస్‌ను శుభ్రపరిచారు. వర్సిటీ ప్రాంగణంలో మొక్కలు నాటారు. పోస్టర్ తయారీ పోటీ విజేతలకు బహుమతులు అందజేశారు. విశ్వవిద్యాలయ ఇన్‌చార్జి వైస్-ఛాన్సలర్ చండి చరణ్ రథ్ తదితరులు పాల్గొన్నారు.

నరేంద్రమోదీ పుట్టిన రోజు సందర్భంగా రక్తదానం



రక్తదానశిబిరంలో రాష్ట్రమంత్రి నిత్యానంద గోండ్

పర్లాకిమిడి: ప్రధానమంత్రి నరేంద్రమోదీ పుట్టినరోజును పురస్కరించుకుని స్థానిక బిజూ పట్నాయక్ కళ్యాణ మండపంలో బుధవారం ఉదయం రక్తదాన శిబిరాన్ని బీజేపీ అధ్యక్షులు నవకిశోర్ శోబోరో, మాజీ ఎమ్మెల్యే కోడూరు ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, విద్య, గణశిక్షా మంత్రి నిత్యానంద గోండ్ ముఖ్యఅతిథిగా శిబిరాన్ని ప్రారంభించారు. ఎక్సైజ్ సూపరింటెండెంటు, బీజేపీ శ్రేణులు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. మొత్తం 52 యూనిట్ల రక్తాన్ని సేకరించినట్టు బ్లడ్‌బ్యాంక్ అధికారులు తెలియజేశారు. సీడీఎంవో డాక్టర్ మహ్మద్ ముబారక్ ఆలీ, మాజీ ఎమ్మెల్యే కోడూరు నారాయణ రావు, జిల్లాపరిషత్ మాజీ చైర్మన్ పాట్నూరు లత, కౌన్సిలర్లు బబునా బెహేరా, బాలక్రిష్ణ పాత్రో, నృసింహాచరణ్ పట్నాయక్ పాల్గొన్నారు.

చిన్నారుల్లో ఆధ్యాత్మికత పెంపొందించాలి



బహుమతులు అందజేస్తున్న అతిథులు



రాధా,గోపి వేషాధారలతో చిన్నారులు



విశేషపూజలను నిర్వహిస్తున్న భాస్కరాచార్యులు

రాయగడ: చిన్నారులకు చదువు, మన సంస్కృతి, సంప్రదాయాలతో పాటు ఆధ్యాత్మికతపై అవగాహన కలిగేలా తల్లిదండ్రులు కృషి చేయాలని స్థానిక బాలాజీనగర్‌లోని కళ్యాణవేంకటేశ్వర ఆలయ ధర్మకర్తల మండలి అధ్యక్షులు కొత్తకోట చంద్రమౌళి కుముంధాన్ అన్నారు. రెండు రోజులుగా ఆలయ ప్రాంగణంలో ప్రధాన అర్చకులు భాస్కరాచార్యులు ఆధ్వర్యంలో కొనసాగిన శ్రీకృష్ణ జయంతి వేడుకలు మంగళవారం రాత్రితో ముగిశాయి. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కుముంధాన్ మాట్లాడుతూ.. కనుమరుగవుతున్న మన సంప్రదాయాలను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ముఖ్యంగా చదువుకునే విద్యార్థుల్లో ఆధ్యాత్మికతపై శ్రద్ధ కలిగేలా ఇటువంటి కార్యక్రమాలను నిర్వహించాలని సూచించారు. అనంతరం శ్రీకృష్ణ జయంతిని పురస్కరించుకుని నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమంలో చిన్నారులు వివిధ వేషాధారణలతో అలరించారు. వారి నృత్యాలు అందరిని ఆకట్టుకున్నాయి. శ్రీకృష్ణ, గోపికల వేషాధారలతో పాటు వారు చేసిన నృత్యాలు ఆనందడోలికల్లో ముంచెత్తాయి. ఆలయ ప్రధాన అర్చకులు భాస్కరాచార్యులు రాధాగోవిందునికి విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించారు. నృత్యాల్లో పాల్గొన్న చిన్నారులకు ఈ సందర్భంగా ఆలయ ధర్మకర్తల మండలి అధ్యక్షులు చంద్రమౌళి, కార్యదర్శి రాఘవ కుముంధాన్ బహుమతులను అందజేసి వారిని ఉత్సాహపరిచారు.

క్లుప్తంగా

తేనెటీగల దాడిలో తల్లీకూతుళ్లకు గాయాలు



చికిత్స పొందుతున్న మంజులత

రాయగడ: పొలం పనులు చేసుకుని ఇంటికి తిరిగి వస్తున్న తల్లీకుతూళ్లు తేనేటీగల దాడిలో గాయపడ్డారు. ఈ సంఘటన జిల్లాలోని నారాయణపూర్ పంచాయతీ పరిధిలో గల పిందుగుడ గ్రామ సమీపంలో బుధవారం చోటు చేసుకుంది. మంజులత హియల్(గర్భిణి), ఆమె మూడేళ్ల కూతురు సుశ్రీలు దొందులి కూడలి చేరేసరికి తేనేటీగలు ఒక్కసారిగా దాడి చేశాయి. ఇద్దరూ అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయారు. పక్కనే పొలం పనులు చేసుకుంటున్న కొందరు రైతులు వీరిని చూశారు. అటుగా వస్తున్న వాహనంలో కళ్యాణసింగుపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. తేనేటీగల ముళ్లను వైద్యులు తీశారు. పరిస్థితి కుదుటగా ఉండటంతో చికిత్స అనంతరం ఇంటికి పంపించారు.

గూడ్స్ వ్యాగన్‌లో మంటలు



మంటలను అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

రాయగడ: ఛత్తీష్‌గఢ్ జిల్లా రాయిపూర్ నుంచి విజయవాడకు బొగ్గు లోడ్‌తో వెళ్తున్న గూడ్స్ మంటల్లో చిక్కుకుంది. స్థానిక లద్ద రైల్వే స్టేషన్ సమీపంలో బుధవారం రాత్రి ఈ ప్రమాదం చోటు చేసుకుంది. వ్యాగన్‌లో మంటల వ్యాపించడంతో గూడ్స్ సిబ్బంది వెంటనే రైలును నిలిపి అధికారులకు సమాచారం అందించారు. రాయగడ నుంచి అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. అగ్ని ప్రమాదానికి గల కారణం తెలియాల్సి ఉంది.

ప్రమాదకరంగా గొయ్యి



రోడ్డుపై ఏర్పడిన గొయ్యి

పర్లాకిమిడి: పట్టణంలో మూడు రోడ్ల జంక్షన్ లో పాత ఫైర్ స్టేషన్ వద్ద సీసీ రోడ్డులో భారీ గొయ్యి ఏర్పడింది. దీంతో వాహనచోదకులు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. ముఖ్యంగా రాత్రిపూట వాహనదారులకు ఇబ్బందులు తప్పడం లేదు. అధికారులు స్పందించి గొయ్యిని పూడ్చాలని పలువురు కోరుతున్నారు.

బస్టాండ్ పరిశుభ్రత



బస్టాండ్ శుభ్రపరిచే కార్యక్రమంలో బీజేపీ కార్యకర్తలు, నాయకులు

రాయగడ: దేశ ప్రధాని నరేంద్రమోదీ 75వ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక బీజేపీ శ్రేణులు బస్టాండును శుభ్రపరిచారు. స్వచ్ఛ ఉత్సవ్ సందర్భంగా బస్టాండ్ పరిసరాలను శుభ్రం చేశారు. అనంతరం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. బీజేపీ సీనియర్ నాయకులు బసంత కుమార్ ఉలక, పద్మనాభ దాస్, మంజులా మినియాక పాల్గొన్నారు.

పీహెచ్‌సీ ముందు గిరిజన మహిళల ధర్నా

పాతపట్నం: మండలంలోని బైదలాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం(పీహెచ్‌సీ) ముందు వైద్యం అందడం లేదని గిరిజన మహిళలు ప్లకార్డులతో ధర్నా చేపట్టారు. బుధవారం ఉదయం ఆర్.ఎల్.పురం,పెద్ద సున్నాపురం, రామన్నగూడ తదితర గిరిజన గ్రామాలకు చెందిన మహిళలు పీహెచ్‌సీకి చేరుకున్నారు. ప్లకార్డులు పట్టుకొని తమకు డాక్టర్ వద్దని ఆందోళన చేపట్టారు. వైద్యం కోసం ఆస్పత్రికి వస్తే.. వేరే ఆస్పత్రికి రిఫర్ చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వేరే డాక్టర్‌ను నియమించి తమకు సకాలంలో వైద్యం అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

వీధి కుక్కల దాడిలో నలుగురికి గాయాలు

మందస: మండల కేంద్రంలో వీధి కుక్కల దాడిలో నలుగురు వ్యక్తులకు గాయాలయ్యాయి. బుధవారం గుంపుగా వెళ్లి దాడిచేసి ఇద్దరు మహిళలు, ఇద్దరు పురుషులకు కాటు వేశాయి. దీంతో వీరికి మందస ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స అందిస్తున్నారు. ప్రస్తుతం కుక్కలు విచ్చలవిడిగా తిరుగుతూ దాడులు చేస్తున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి నియంత్రణ చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



రాయగడ: పాఠశాలలో మొక్కలతో ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు



మల్కన్‌గిరి: మొక్క నాటుతున్న మల్కన్‌గిరి ఎమ్మెల్యే నర్సింగ్ మడ్కమి



జయపురం: మొక్కలు నాటేందుకు బయలుదేరిన సిటీ స్కూల్ విద్యార్థులు

మొక్కలతోనే మనుగడ

మొక్కలు నాటి సంరక్షించినప్పుడే మానవ మనుగడ సాధ్యమవుతుందని వక్తలు పిలుపునిచ్చారు. 'ఒక చెట్టు తల్లికి ఒక పేరు' కార్యక్రమంలో భాగంగా బుధవారం రాష్ట్రవ్యాప్తంగా మొక్కలు నాటారు. గవర్నర్, ముఖ్యమంత్రులు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరై మొక్కలు నాటారు. ప్రతిఒక్కరూ పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలని పిలుపునిచ్చారు. – సాక్షి నెట్‌వర్క్



పర్లాకిమిడి: బృందావన్ ప్యాలస్‌లో మొక్క నాటుతున్న మంత్రినిత్యానంద గోండ్, అధికారులు



జయపురం: బదిలిగుడలో మొక్కలు నాటుతున్న విద్యార్థులు



రాయగడ: పర్యావరణ ప్రతిజ్ఞ చేస్తున్న కలక్టర్ కులకర్ణి తదితరులు

672 కేజీల గంజాయి స్వాధీనం

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి జిల్లా కలిమెల సమితి ఎం.వి 90 గ్రామం వద్ద మంగళవారం రాత్రి కలిమెల పోలీసు స్టేషన్ ఎస్ఐ డి.డి.సుగ్రీ తన సిబ్బందితో పెట్రోలింగ్ నిర్వహించారు. బైక్‌పై ముగ్గురు వ్యక్తులు అతివేగంగా రావడంతో పోలీసులకు అనుమానం వచ్చింది. వారిని ఆపి తనిఖీ చేశారు. ఆ ముగ్గురు బైక్‌ను, గంజాయి బస్తాను వదిలి పారారయ్యారు. బైక్‌ను, గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఐ బి.కె.మాఝి తన సిబ్బందితో పుల్లిమేట్ల గ్రామం వద్ద పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా.. మోటు వైపుకు అతి వేగంగా ఓ కారు వచ్చింది. అందులో 26 బస్తాల్లో గంజాయిని అక్రమంగా తరలిస్తున్నారు. కారును ఆపి తనిఖీ చేయగా అందులో గంజాయి ఉంది. వెంటనే ఈ గంజాయి ఏవరిది అని ఆరా తీయగా యం.పి.వి 13 గ్రామానికి చెందిన సుమన్ హల్దార్‌కి చెందినది అని పోలీసులు తెలుసుకున్నారు. వెంటనే సుమన్‌ను అరేస్టు చేసి కారును, గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. బుధవారం మొత్తం గంజాయిని తూకం వేయగా 677 కేజీలు ఉంది. ఐఐసీ ముకుందో మేల్క మాట్లాడుతూ ఈ మొత్తం గంజాయి విలువ రూ.50 లక్షల వరకు ఉంటుందన్నారు. బైక్‌ను విడిచిపెట్టి పారారైన వారి కోసం గాలిస్తున్నామన్నారు. కేసు నమోదు చేసి సుమన్‌ను కోర్టుకు తరలిస్తామన్నారు.



బైక్, గంజాయిని చూపిస్తున్న పోలీసులు



గంజాయి బస్తాలు, నిందితుడి సుమన్‌ను చూపిస్తున్న పోలీసులు

గుర్తుతెలియని వాహనం ఢీకొని వృద్ధుడు మృతి

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి జిల్లా కలిమెల సమితి ఉంద్రుకొండ ప్రాంతంలో గుర్తుతెలియని వాహనం ఢీకొని వృద్ధుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. మంగళవారం రాత్రి వృద్ధునికి గుర్తుతెలియని వాహనం ఢీకొని వెళ్లిపోయింది. కొంత సమయం వరకు సంఘటనా స్థలంలోనే వృద్ధుడు పడి ఉన్నాడు. అటుగా వచ్చిన కొంతమంది చూసి కలిమెల ఆరోగ్య కేంద్రానికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం ఉదయం మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న కలిమెల పోలీస్ అధికారి(ఐసీసీ) ముకుందో మేల్క తన సిబ్బందితో వెళ్లి వివరాలు సేకరించారు. వృద్ధుడు ఎక్కడి నుంచి వచ్చాడో తెలియదని, ఈ ప్రాంత వాసి కాదని స్థానికులు తెలిపారు. 72 గంటలపాటు మార్చురీలో ఉంచుతామని, ఏవరైనా వస్తే పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని అప్పగిస్తామని ఐసీసీ తెలిపారు. లేకపోతే తహసీల్దార్, పోలీసుల ఆధ్వర్యంలో పోస్టుమార్టం నిర్వహిస్తామన్నారు.



కలిమెల ఆరోగ్య కేంద్రం వద్ద వృద్ధుడి మృతదేహం

బీజేడీ ఆందోళన

కొరాపుట్: మహిళలపై జరుగుతున్న దురాఘాతాలను అడ్డుకోవాలని ప్రతిపక్ష బీజేడీ ఆందోళన బుధవారం చేసింది. నబరంగ్‌పూర్ జిల్లా కేంద్రంలోని ఎస్పీ కార్యాలయం వద్ద ఆందోళన చేశారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు, డాబుగాం ఎమ్మెల్యే మనోహర్ రంధారి నివాసం నుంచి ఎస్పీ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. బీజేడీ ముఖ్య నాయకులు తన గదికి రావాలని ఎస్పీ మడకర్ సంపత్ సూచించారు. ఇప్పటివరకు తీసుకున్న చర్యలను బీజేడీ నాయకులకు ఎస్పీ వివరించారు. ఇంకేం చర్యలు తీసుకోవాలో సూచించాలని కోరారు. జిల్లాలో మహిళల రక్షణ కోసం బీజేడీ నాయకులు సూచనలు చేశారు. వారు చెప్పిన అన్ని రక్షణ చర్యలూ వెంటనే తీసుకొంటామని ఎస్పీ హామీ ఇచ్చారు. ఎస్పీకి బీజేడీ నాయకులు వినతిపత్రం అందించారు. మాజీ ఎమ్మెల్యేలు సదాశివ ప్రధాని, సుభాష్ గోండో, మాజీ జెడ్పీ చైర్‌పర్సన్ మంజులా మఝి, మాజీ జెడ్పీ వైస్ ప్రెసిడెంట్ నివేదిత మహంతి, కౌసల్య ప్రధాని, రబి పట్నాయక్ పాల్గొన్నారు.



బీజేడీ నాయకులతో చర్చలు జరుపుతున్న ఎస్పీ మడకర్ సంపత్

ట్రాఫిక్ కానిస్టేబుల్ మృతదేహం లభ్యం

భువనేశ్వర్: మహిళా ట్రాఫిక్ కానిస్టేబుల్ శుభ మిత్ర సాహు ఈ నెల 6వ తేదీ నుంచి కనిపించకుండా పోయింది. కెంఝొహర్ ఘుటొగాంవ్ అటవీ ప్రాంతంలో ఆమె మృతదేహం బుధవారం లభ్యమైంది. పోలీస్ కమిషనర్ కార్యాలయంలో పనిచేస్తున్న ఆమె స్నేహితుడు గుమాస్తా దీపక్ రౌత్ పట్ల తలెత్తిన సందేహం ప్రాథమికంగా రుజువు అయింది. తదుపరి దర్యాప్తు కొనసాగుతోంది. నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకుని ప్రశ్నిస్తున్నారు. ప్రాథమిక విచారణలో తేలిన ఆధారాలతో పోలీసులు నిందితుడు దీపక్ రౌత్‌ను శుభమిత్ర మృతదేహాన్ని వెలికితీసేందుకు కెంఝొహర్ ఘుటొగాంవ్ అటవీ ప్రాంతంలో పాతిపెట్టిన ప్రదేశానికి భువనేశ్వర్ నుంచి తీసుకెళ్లారు. పోలీసులు, మేజిస్ట్రేట్ సమక్షంలో జేసీబీ సహాయంతో తవ్వి శుభమిత్ర మృతదేహాన్ని బయటకు తీశారు. సిమెంట్ సంచిలో కట్టిన మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు.



శుభ మిత్ర సాహు(ఫైల్)

కలప లారీ స్వాధీనం

నరసన్నపేట: మండలంలోని గోపాలపెంట నుంచి ఎచ్చెర్లకు అక్రమంగా లారీలో కలపను తరలిస్తుండగా నరసన్నపేట ఫారెస్టు సిబ్బంది బుధవారం పట్టుకున్నారు. సుమారు రూ.లక్ష విలువ కలిగిన అకేసీ కలపను లారీలో ఎటువంటి అనుమతులు లేకుండా అక్రమంగా తరలిస్తున్నట్లు సమాచారం రావడంతో ఫారెస్టు సిబ్బంది పట్టుకున్నారు. ఫారెస్టు రేంజి ఆఫీసర్ జగదీష్ మాట్లాడుతూ అక్రమ కలప రవాణా లారీపై కేసు నమోదు చేసి వివరాలు డీఎఫ్‌వోకు తెలియజేశామని, పరిశీలించి తగిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.

నాణ్యత లోపిస్తే కఠిన చర్యలు



నిర్మాణ భవనాలు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

● ఎమ్మెల్యే గౌరీ మఝి

కొరాపుట్: ఇంద్రావతి మెగా హిల్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ నిర్మాణంలో నాసిరకంగా పనులు జరిగితే ఉపేక్షించబోమని బీజేపీకి చెందిన నబరంగ్‌పూర్ ఎమ్మెల్యే గౌరీ శంకర్ మఝి హెచ్చరించారు. బుధవారం ఇంద్రావతి ప్రాంతంలో రెండు కొండల మధ్య నిర్మాణం జరుగుతున్న ప్రాంతాన్ని సందర్శించారు. ఈ నిర్మాణంపై దాదాపు నాలుగు దశాబ్దాలుగా ప్రజలు ఎదురుచూస్తున్నారన్నారు. ఈ ప్రాజెక్ట్ పూర్తయితే తెంతులకుంటి, నందాహండి, నబరంగ్‌పూర్ సమితుల్లో 19 వేల హెక్టార్లకు సాగునీరు అందుతుందన్నారు. ఇంతవరకు ఈ ప్రాంతంలో ఏడాదికి ఒకే పంట పండించే రైతులు ఖరీఫ్‌తోపాటు, రబీలో కూడా పంటలు వేసుకోవచ్చన్నారు. ప్రాజెక్ట్‌కి అనుసంధానం చేసే రోడ్లు, అక్కడ నిర్మితం అవుతున్న భవనాలు, తదితర ప్రాంతాలను సందర్శించారు. కొత్త నిర్మాణాలకు భూమి పూజ చేశారు. తాను ఈ నిర్మాణ పురోగతిని పరిశీలిస్తుంటానన్నారు.



భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే గౌరీ శంకర్ మఝి

ప్రశ్నించేతత్వం అలవర్చుకోవాలి



మాట్లాడుతున్న జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్

శ్రీకాకుళం న్యూకాలనీ:

విద్యార్థులు ప్రశ్నించేతత్వం అలవర్చుకోవాలని జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ సూచించారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ పురుషుల డిగ్రీ, పీజీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కణితి శ్రీరాములు అధ్యక్షతన కళాశాల సిల్వర్ జూబ్లీ ఆడిటోరియం వేదికగా సమాజంలో సైన్స్ వైబ్రేషన్ పేరిట రెండు రోజుల సైన్స్ ప్రయోగాల ప్రదర్శన కార్యక్రమాన్ని బుధవారం ప్రారంభించారు. కళాశాల సెంటర్ ఫర్ అప్లయిడ్ సైన్సెస్, జంతుశాస్త్ర విభాగాలు సంయుక్తంగా ఇండిజీనిఎస్ ఫర్ ఫ్రోగల్ సైన్స్ ఇన్వెన్షన్ సొసైటీ సౌజన్యంతో ఈ ఎగ్జిబిషన్ నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ.. ప్రశ్నించే తత్వం ఉంటే విషయ పరిజ్ఞానం పెరిగి, అభివృద్ధి చెందుతారని పేర్కొన్నారు. అలాగే సైంటిఫిక్ టెంపర్, పరిశోధనా విధానాన్ని ప్రతి ఒక్కరూ అలవర్చుకోవాలన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీరాములు మాట్లాడుతూ ఇటువంటి సైన్స్ ఎగ్జిబిషన్లతో విద్యార్థుల్లో పోటీతత్వం పెరుగుతుందన్నారు.

కార్యక్రమంలో లైఫ్ సైన్సెస్ విభాగాధిపతి డాక్టర్ మదమంచి ప్రదీప్, ఎస్‌వైకే డిప్యూటీ డైరెక్టర్ కె.వెంకట్ ఉజ్వల్, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ వై.పోలినాయుడు, ప్రోగ్రాం కో-ఆర్డినేటర్స్ డాక్టర్ రోణంకి హరిత, పి.సుధారాణి, శివాల రవిబాబు, కె.అపర్ణ తదితరులు పాల్గొన్నారు.



ప్రాజెక్ట్ గురించి జేసీకి వివరిస్తున్న విద్యార్థిని

ఘనంగా విశ్వకర్మ జయంతి

దేవ శిల్పి విశ్వకర్మ జయంతి వేడుకలు బుధవారం అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. స్వర్ణకార సంఘం ఆధ్వర్యంలో విశ్వకర్మ విగ్రహాలను కొలువుదీర్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. – సాక్షి నెట్‌వర్క్



జయపురం: ఆర్‌అండ్‌బీ కార్యాలయ ప్రాంగణంలో..



జయపురం: విశ్వకర్మకు పూజలు చేస్తున్న స్వర్ణకార సంఘం ప్రతినిధులు



జయపురం: రాజమేస్త్రీ మిలిత సంఘం పూజామండపంలో విశ్వకర్మ



జయపురం: పీహెచ్‌సీ కార్యాలయంలో..



జయపురం: కార్మిక యూనియన్ కార్యాలయం వద్ద..



పర్లాకిమిడి: బట్టగొడ వీధి వద్ద విశ్వకర్మ పూజలు



మల్కన్‌గిరి: విశ్వకర్మ పూజ చేస్తున్న వ్యాపారి



మల్కన్‌గిరి: బలిమెల పవర్ హౌస్‌లో పూజలందుకుంటున్న విశ్వకర్మ



జయపురం: రూరల్ వాటర్ వర్క్స్ డివిజన్‌లో..

గంజాయితో ఇద్దరు యువకులు అరెస్టు

ఇచ్ఛాపురం:

స్థానిక రైల్వేస్టేషన్ సమీపంలోని ఎల్‌సీ గేట్ వద్ద 11 కేజీల గంజాయితో ఇద్దరు యువకులను మంగళవారం సాయంత్రం అదుపులోకి తీసుకున్నామని సీఐ మీసాల చిన్నంనాయుడు తెలిపారు. ఈ మేరకు సీఐ కార్యాలయం ఆవరణలో పత్రికా సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైల్వే ఎల్‌సీగేట్ సమీపంలో పోలీసులు తనిఖీలు నిర్వహిస్తుండగా.. తమిళనాడుకి చెందిన కదాశిమ ముత్తుకుమార్, కపిల్‌దేవ్ మరియప్పన్ 11.120 కేజీల గంజాయితో పట్టుబడినట్లు తెలిపారు. తమిళనాడు రాష్ట్రం తుత్తుకొడి పట్టణానికి చెందిన వీరిద్దరూ.. వారి కుటుంబ ఆర్థిక పరిస్థితి బాగులేకపోవడంతో గంజాయి వ్యాపారం చేయాలని నిర్ణయించుకున్నారు. ఈ క్రమంలో ఒడిశాకి చెందిన గంజాయి వ్యాపారి మణిక్ సబర్ వద్ద తక్కువ రేటుకి గంజాయిని కొనుగోలు చేశారు. అనంతరం ఒడిశా నుంచి బస్సు ద్వారా ఇచ్ఛాపురం చేరుకున్నారు. అక్కడ నుంచి రైలు మార్గం ద్వారా తమిళనాడుకి వెళ్లేందుకు గంజాయిని తీసుకెళ్తుండగా ఎల్‌సీగేట్ వద్ద రూరల్ పోలీసులకు పట్టుబడ్డారు. వీరి వద్ద నుంచి గంజాయి, సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకొని అరెస్టు చేసి రిమాండ్‌కి తరలించినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో రూరల్ ఎస్ఐ శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీఐ మీసాల చిన్నంనాయుడు

క్లుప్తంగా

వేట చేస్తూ మత్స్యకారుడి మృతి


రాముడు (ఫైల్)

పూసపాటిరేగ: మండలంలోని చింతపల్లి గ్రామానికి చెందిన మత్స్యకారుడు గుజరాత్ రాష్ట్రంలో సముద్రంలో వేట చేస్తూ ప్రమాదవశాత్తు మృతిచెందాడు. ఈ ఘటన వివరాల్లోకి వెళ్తే..గ్రామానికి చెందిన బడి రాముడు(44) కొంత కాలం క్రితం బతుకు తెరువు కోసం గుజరాత్‌కు చెందిన బోటులో కూలీగా వేటకు వెళ్లాడు. వేట చేస్తుండగా మంగళవారం ఆకస్మాత్తుగా మృతిచెందాడు. 15 రోజులుగా సముద్రంలో వేట చేస్తున్న రాముడు ఆకస్మాత్తుగా మృతి చెందినట్లు తోటి మత్స్యకారులు తెలిపారు. మృతుడికి భార్య సీతమ్మ, కుమారుడు వెంకటరమణ ఉన్నారు. మృతదేహం గురువారం సాయంత్రానికి పూసపాటిరేగ మండలం చింతపల్లికి వచ్చే అవకాశం ఉందని జిల్లా మత్స్యకార సహకార సొసైటీ అధ్యక్షుడు బర్రి చినఅప్పన్న తెలియజేశారు.

981 కేజీల పీడీఎస్ బియ్యం పట్టివేత

సాలూరు: మున్సిపాలిటీ పరిధిలో అక్రమంగా తరలిస్తున్న 981 కేజీల పీడీఎస్ బియ్యం పట్టుకున్నట్లు పట్టణ సీఐ అప్పలనాయుడు తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆయన మాట్లాడుతూ, ముందస్తు సమాచారం మేరకు పెదబజారులో 49 బస్తాలలో అక్రమంగా తరలిస్తున్న 981కేజీల పీడీఎస్ బియ్యాన్ని గుర్తించి పట్టుకున్నామన్నారు. దీనికి సంబంధించి ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకుని, సీజ్ చేసిన బియ్యం మండల ఎగ్జిక్యూటివ్ మెజిస్ట్రేట్‌కు అప్పగించినట్లు తెలిపారు.

21న జూనియర్ అథ్లెటిక్స్ క్రీడాకారుల ఎంపిక

విజయనగరం: రాష్ట్రస్థాయిలో జరగబోయే జూనియర్స్ బాల, బాలికల అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొనబోయే జిల్లా క్రీడాకారుల ఎంపిక పోటీలు ఈనెల 21న నిర్వహించనున్నట్లు జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు పి.లీలాకృష్ణ, ఎ.శ్రీకాంత్‌లు తెలిపారు. ఆ రోజు ఉదయం 8 గంటల నుంచి నగర శివారులో గల విజ్జి స్టేడియంలో ఎంపిక పోటీలు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. అండర్-14,16,18,20 వయస్సుల విభాగాల్లో బాల, బాలికలకు డిస్కస్‌త్రో, లాంగ్, హైజంప్స్ విభాగాల్లో ఎంపికలు జరుగుతాయన్నారు. పోటీల్లో అండర్-14 విభాగంలో 2011 అక్టోబర్ 15వ తేదీ తరువాత అండర్-16 విభాగంలో 2009 అక్టోబర్ 15వ తేదీ అనంతరం అండర్-18 విభాగంలో 2007 అక్టోబర్ 15వ తేదీ అనంతరం అండర్-20 విభాగంలో 2005 అక్టోబర్ 15వ తేదీ అనంతరం జన్మించిన క్రీడాకారులు మాత్రమే పాల్గొనేందుకు అర్హులుగా స్పష్టం చేశారు. ఎంపికల్లో 16 సంవత్సరాలలోపు వయస్సు గల క్రీడాకారులు జనన ధ్రువీకరణపత్రంతో పాటు ఆధార్‌కార్డు వెంట తీసుకురావాలని సూచించారు. అదేవిధంగా 16 సంవత్సరాలు పైబడిన విభాగంలో పాల్గొనే క్రీడాకారులు జనన ధ్రువీకరణపత్రం, పదవతరగతి సర్టిఫికెట్, ఆధార్ కార్డు వెంట తీసుకురావాలని తెలిపారు. జిల్లాస్థాయి ఎంపిక పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు ఈనెల 27 నుంచి 29వ తేదీ వరకు ఏలూరు జిల్లాలో జరగబోయే అంతర్ జిల్లాల పోటీలకు విజయనగరం జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహించనున్నట్లు పేర్కొన్నారు. అర్హత, ఆసక్తి గల క్రీడాకారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఏఆర్ డీఎస్పీగా కోటిరెడ్డి


ఏఆర్ డీఎస్పీ కోటిరెడ్డి

విజయనగరం క్రైమ్: ఆర్మ్‌డ్ రిజర్వ్ డీఎస్పీగా ఇ.కోటిరెడ్డి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆర్మ్‌డ్ విభాగంలో ఇన్‌స్పెక్టర్లు కొత్త డీఎస్పీకి పుష్పగుచ్ఛాలు ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఏఆర్ అడిషనల్ ఎస్పీ నాగేశ్వరరావు, అదనపు ఎస్పీ (అడ్మిన్)సౌమ్యలతను ఏఆర్ డీఎస్పీ మర్యాద పూర్వకంగా కలిశారు.

ఎన్‌సీసీ క్యాడెట్ల ఎంపిక


ఎన్‌సీసీ క్యాడెట్‌లుగా ఎంపికైన విద్యార్థినులు

విజయనగరం అర్బన్: స్థానిక గాజులరేగ పరిధిలోని సీతం ఇంజినీరింగ్ కళాశాలలో 2 ఏ గర్ల్స్ బెటాలియన్ విజయనగరం ఆధ్వర్యంలో ఎన్‌సీసీ క్యాడెట్ల ఎంపిక శిబిరం బుధవారం విజయవంతంగా జరిగింది. ఎంపిక ప్రక్రియలో అభ్యర్థులను 500 మీటర్ల పరుగుపందెం, ఎత్తు, బరువు, కంటి చూపు పరీక్ష, అవయవాల కదలిక పరీక్ష, బాడీ మాస్ ఇండెక్స్ అంచనా, లిఖిత పరీక్ష, వ్యక్తిగత ఇంటర్వ్యూ ద్వారా శారీరక, మానసిక సామర్థ్యాలను పరిశీలించారు. మొత్తం 150 మంది సీతం కళాశాల బాలికలు, అలాగే 100 మంది సత్య డిగ్రీ అండ్ పీజీ కళాశాల బాలికలు ఈ ఎంపిక ప్రక్రియలో పాల్గొన్నారు. కార్యక్రమంలో సీతం డైరెక్టర్ డాక్టర్ మజ్జి శశిభూషణ రావు, ప్రిన్సిపాల్ డాక్టర్ డీవీరామమూర్తి, సత్య డిగ్రీ ప్రిన్సిపాల్ డాక్టర్ సాయిదేవమణి, ఎన్‌సీసీ అధికారులు కెప్టెన్ ఎం.సత్యవేణి, లెఫ్టినెంట్ ఎం.వరలక్ష్మి, సీఎస్ఓ సత్యనారాయణ, పీడీ మహేష్, ఎన్‌సీసీ క్యాడెట్లు పాల్గొన్నారు.

నాటుకోడికి డిమాండ్


ఈ నాటుకోడికి భలే డిమాండ్

- పెరుగుతున్న వినియోగం
- గ్రామాల్లో పెంపకంపై ఆసక్తి


రాజాం వారపు సంతలో నాటుకోళ్ల విక్రయాలు(ఫైల్)

రాజాం: కొంతకాలంగా బ్రాయిలర్ కోళ్ల వినియోగం విపరీతంగా పెరిగింది. నెలలో కనీసం నాలుగురోజులైనా బ్రాయిలర్ చికెన్ ఉండాల్సిందే. చుట్టాలు, బంధువులు వచ్చినా..కథా కార్యక్రమం జరిగినా బ్రాయిలర్ కోళ్లు కోసి భోజనం పెట్టాల్సిందే. ప్రస్తుతం ఈ ట్రెండ్ మారుతోంది. బ్రాయిలర్ కోడి మాంసంపై మాంసాహారులకు అయిష్టత ఎక్కువైంది. బలవర్థక ఆహారం తీసుకోవాలనే ఆలోచనతో పాటు రుచికర వంటలపై దృష్టిపెడుతున్నారు. దీంతో 45 రోజుల్లో పెరిగే బ్రాయిలర్ కోడి మాంసానికి స్వస్తిపలికి ఎనిమిది నెలల నుంచి ఏడాది కాలం పాటు పెరుగుదలకు పట్టే నాటుకోడి మాంసంపై ఆసక్తిచూపుతున్నారు. గ్రామాల దగ్గర నుంచి పట్టణాల వరకూ అన్నిచోట్ల ఇప్పుడు నాటుకోడి హాట్‌టాపిక్‌గా మారింది.

గతంలో మాదిరిగా..

20వ దశకం వరకూ గ్రామాల్లో నాటుకోడి పెంపకాలు అధికంగా ఉండేవి. ప్రతి ఇంటి వద్ద నాటుకోళ్లు పెంచడం, వాటి గుడ్లు తినడం అమ్మకాలు చేయడం చేసేవారు. ఆ తరువాత కాలంలో బ్రాయిలర్ పౌల్ట్రీలు రావడం, మారుమూల గ్రామాల్లో సైతం చికెన్ సెంటర్లు అందుబాటులోఉండడం, కిలో చికెన్ ధర రూ.200 నుంచే లభించడంతో నాటుకోడి కొనుగోళ్లు పడిపోయాయి. గ్రామాల్లో ఇంటిపెరడు, ఖాళీ స్థలాలు కనుమరుగవడంతో వాటి పెంపకానికి చాలామంది స్వస్తి పలికారు. బ్రాయిలర్ కోడిమాంసం రుచి తగ్గడం, వాటిలో పలు కంపెనీలు రావడం, తరచూ రకరకాల వ్యాధులు వచ్చి బ్రాయిలర్ కోళ్లు చనిపోవడంతో మాంసాహారుల్లో ఆ మాంసంపై చులకన ఏర్పడింది. తింటే నాటుకోడి లేకుంటే గొర్రె మాంసం తినాలనే చందంగా ఇప్పుడంతా నాటుకోడి మాంసంపై పడ్డారు. దీంతో వాటి డిమాండ్ కారణంగా గ్రామాల్లో చిన్న చిన్న నాటుకోడి ఫామ్‌లు, పెద్ద పెద్ద కుటుంబాలు సైతం తమ పంటపొలాల్లో కొంత స్థలాన్ని నాటుకోడి పెంపకాలకు ఏర్పాటుచేయడం, పలుచోట్ల నాటుకోళ్ల ఫారాలు ఏర్పాటయ్యాయి.

భలే డిమాండ్

ప్రస్తుతం గ్రామాల్లో గ్రామదేవత ఉత్సవాలు జరుగుతున్నాయి. వీటికి తోడు దసరా ఆయుధపూజకు అధికంగా నాటుకోళ్లు మొక్కుతారు. దీంతో ఇటీవల వీటికి డిమాండ్ ఎక్కువైంది. నాటుకోడి మాంసానికి మటన్ ధర మాదిరిగానే రేటు పలుకుతోంది. కిలో కోడి ధర రూ. 800 చొప్పున విక్రయాలు జరుగుతున్నాయి. కిలోన్నర కోడి చేస్తే కిలో చికెన్ వస్తుంది. ఇంత ధర ఉన్నా ఈ కోడి మాంసాన్నే అందరూ ఇష్టపడుతున్నారు. ఈ మాంసం తినడం ద్వారా ఎటువంటి ఇతర అనారోగ్య సమస్యలు ఉండవని, పలురకాల గాయాల బారిన పడినవారు, ఆపరేషన్లు జరిగినవారంతా ఈ నాటుకోడి మాంసాన్ని వినియోగిస్తే వేగంగా నయమౌతుందనే నమ్మకం ప్రజల్లో ఉంది. దీంతో ఈ కోళ్లకు డిమాండ్ వచ్చింది. వీటితో పాటు నాటుకోడి గుడ్డు ధర కూడా మార్కెట్లో అధికంగా పలుకుతోంది. ఒక గుడ్డు ధర రూ.20లు వరకూ విక్రయాలు జరుగుతున్నాయి.

వ్యాపారం బాగుంది



మా వద్ద నాటుకోళ్లు, సోనాయిలు నాటు, కథక్‌నాథ్ కోళ్లు లభిస్తాయి. గత ఏడెనిమిదేళ్లుగా నాటుకోళ్ల ఫారం నడుపుతున్నాం. ఓపికతో వాటి పెంపకంచేయాలి. మంచి ధర వస్తుంది. ఇప్పుడు వీటికి చాలా డిమాండ్ ఉంది. కిలోన్నర కోడి పెరగగానే కొనుక్కుని వెళ్లిపోతున్నారు.

శానపు చిన్నబాబు, నాటుకోళ్లఫారం యజమాని, పొనుగుటివలస, రాజాం.

ప్రైవేట్ సెంటర్‌లో ఎంఆర్ఐ స్కాన్..!

- కమీషన్ల కోసం రిఫర్ చేస్తున్న సర్వజన ఆస్పత్రి వైద్యులు
- రూ.4 వేల నుంచి రూ. 5 వేలు వెచ్చిస్తున్న రోగులు


ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలోని ఎంఆర్ఐ స్కాన్ మిషన్

విజయనగరంఫోర్ట్: ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో ఎంఆర్ఐస్కాన్ అందుబాటులో ఉన్నప్పటికీ వైద్యులు రోగులకు ప్రైవేట్ స్కాన్ రాయడం చర్చనీయాంశమవుతోంది. ఇటీవల ప్రభుత్వ వైద్యులు రోగులను ప్రైవేట్ స్కానింగ్ సెంటర్లకు రిఫర్ చేస్తున్నారనే ఆరోపణలు ఎక్కువగా వినిపిస్తున్నాయి. ప్రైవేట్ స్కానింగ్ సెంటర్లు ఇచ్చే కమీషన్ల కోసమే వైద్యులు రిఫర్ చేస్తున్నట్లు తెలుస్తోంది. ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో ఎంఆర్ఐ స్కాన్ ఉచితంగా తీయాలి. అదే ప్రైవేట్ సెంటర్‌లో అయితే వేలల్లో కమీషన్ వస్తుందనే కక్కుర్తితో వైద్యులు రిఫర్ చేస్తున్నట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి.

రూ.2వేల నుంచి రూ.2500 వరకు కమీషన్

ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి వైద్యులకు ప్రైవేట్ స్కానింగ్ సెంటర్ల వైద్యులు పెద్ద ఎత్తున కమీషన్లు ఆఫర్ చేస్తున్నట్టు సమాచారం. ఎక్కువ స్కాన్‌లు ఆఫర్ చేసే వైద్యులకు 40 శాతం నుంచి 50 శాతం వరకు కమీషన్ ఆఫర్ చేస్తున్నారు. తక్కువ స్కాన్‌లు రిఫర్ చేసే వారికి 30 నుంచి 35 శాతం కమీషన్ ఆఫర్ చేస్తున్నారు. ఎంఆర్ఐ స్కాన్ చేసే వైద్యుడికి ఒక్కో స్కాన్‌కు రూ.2 వేల నుంచి రూ.2500 వరకు కమీషన్ రూపంలో అందుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. అందుచేతనే ప్రైవేట్ స్కాన్‌కు రిఫర్ చేయడానికి వైద్యులు అసక్తి చూపుతున్నట్లు తెలుస్తోంది.

రూ.4 వేల నుంచి రూ.5 వేలు వెచ్చిస్తున్న రోగులు

ప్రైవేట్ స్కానింగ్ సెంటర్లలో రోగులు ఎంఆర్ఐ స్కాన్ కోసం వేలాది రూపాయలు వెచ్చిస్తున్నారు. ఎంఆర్ఐ స్కాన్ కోసం రూ.4 వేల నుంచి రూ. 5 వేల వరకు ప్రైవేట్ సెంటర్లు వసూలు చేస్తున్నాయి. వ్యాధి నిర్ధారణలో ఎంఆర్ఐ స్కాన్ అత్యంత కీలకం కావడంతో రోగులు గత్యంతరం లేని పరిస్థితుల్లో వేలాది రుపాయలు వెచ్చించక తప్పడం లేదు.

ఎంఆర్ఐ స్కాన్ కోసం ఓ వైద్యుడి కొర్రీ


ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి ఓపీపై ప్రైవేట్ స్కాన్‌కు రాసిన ఎంఆర్ఐ స్కాన్ చీటీ

ఏదైనా వ్యాధితో వచ్చే వారికి సంబంధిత వైద్యుడు ఎంఆర్ఐ స్కాన్ రాస్తే ఆస్పత్రిలోని ఓ వైద్యుడు తన సంతకం లేకుండా స్కాన్ తీయడానికి వీలు లేదని కొర్రీ పెడుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. వైద్యులు రాసిన చాలా వరకు ఎంఆర్ఐ స్కాన్‌లను ఆ వైద్యుడు వెనక్కి పంపిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

రిఫర్ చేస్తే చర్యలు తీసుకుంటాం

ఎంఆర్ఐ స్కాన్ కోసం ప్రైవేట్ స్కానింగ్ సెంటర్లకు వైద్యులు రిఫర్ చేస్తున్న విషయం తెలియదు. విచారణ చేసి ఆ విధంగా రిఫర్ చేసిన వారిపై చర్యలు తీసుకుంటాం. ఆస్పత్రిలో ఎంఆర్ఐ స్కాన్ అందుబాటులో ఉంది. అవసరమైన వారికి తీసే విధంగా చర్యలు తీసుకుంటాం.

డాక్టర్ అల్లుపద్మజ, సూపరింటెండెంట్, ప్రభుత్వసర్వజన ఆస్పత్రి

నదిలో మునిగిపోయి రెండు ఎడ్లు మృతి

- ప్రాణాలతో బయటపడిన రైతు


నది గోతిలో పడిన ఎద్దులను ట్రాక్టర్ సహాయంతో తీస్తున్న గ్రామస్తులు


ఎద్దుల కళేబరాలు

సీతానగరం: నదిని నమ్ముకుని జీవనం సాగిస్తున్న రైతుకు జీవనాధారమైన రెండు ఎద్దులను ఆ నదే మృత్యువు ఒడిలోకి తీసుకు పోగా, అదృష్టవశాత్తు రైతు ప్రాణాలతో బయటపడ్డాడు. మండలకేంద్రం సీతానగరంలో బుధవారం జరిగిన ఈ సంఘటన వివరాలిలా ఉన్నాయి. సామంతల శ్రీనివాసరావు అనే రైతు స్థానిక శివాలయం దగ్గర సువర్ణముఖి నది ఒడ్డున స్థిర నివాసం ఏర్పరుచుకున్నాడు ఆ రైతుకు ఎకరా విస్తీర్ణం లోపు వ్యవసాయపొలం ఉంది. వ్యవసాయ పనులు చూసుకుని విరామసమయంలో సువర్ణముఖి నదినుంచి ఇసుక తరలిస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఎప్పటిలాగానే తన ఎద్దుల బండితో సువర్ణముఖి నదికి అవతల ఉన్న పొలంలో పని చేయడానికి వెళ్లాడు. అయితే ఇటీవల ఎగువ ప్రాంతాలకు వర్షాలు కురవడంతో నదిలో ఉండే పెద్ద పెద్దగోతులను గమనించే అవకాశం లేకపోయింది. దీంతో రెండు ఎద్దులతో పాటు నాటు బండి నది గోతిలో దిగి మునిగిపోవడంతో అప్రమత్తమైన రైతు శ్రీనివాసరావు బండి మీదనుంచి దిగి ముందుకు గెంతి ప్రాణాలను రక్షించుకున్నాడు. రైతు చూస్తుండగానే రూ.2 లక్షల విలువైన ఎద్దులు నదిలో మునిగిపోయి ప్రాణాలు కోల్పోయాయి. అక్కడే ఉన్న స్థానికులు వెంటనే రైతు శ్రీనివాసరావును రక్షించి బయటకు తీసుకువచ్చారు. ట్రాక్టర్ తీసుకువచ్చి ఎద్దులను, టైరు బండిని బయటకు తీశారు. కుటుంబ పోషణాధారమైన ఎద్దులు కళ్లెదుటే కన్నుమూయడంతో శ్రీనివాసరావుతో పాటు కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు.

బొంగుడుగూడను సందర్శించిన సెంట్రల్ టీం


పరిశీలిస్తున్న రాహుల్‌కుమార్ ఖురానా

సీతంపేట: మండలంలోని బొంగుడుగూడ గ్రామాన్ని కేంద్ర బృందం పరిశీలకుడు రాహుల్ కుమార్ ఖురానా బుధవారం సందర్శించారు. ఆదికర్మయోగి అభియాన్ కింద గిరిజనులకు అవసరమైన అన్ని రకాల కనీస వసతులు కేంద్ర ప్రభుత్వం కల్పించనున్నట్లు ఈ సందర్భంగా ఆయన తెలిపారు. తన సందర్శనలో భాగంగా గిరిజన జీవన స్థితిగతులు పరిశీలించారు. కార్యక్రమంలో రిసోర్స్‌పర్సన్ కోటిబాబు, డిప్యూటీ ఎంపీడీవో రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాల కూల్చివేత


అనధికారిక నిర్మాణాన్ని తొలగించిన కార్పొరేషన్ అధికారులు

విజయనగరం: ప్రభుత్వ నిబంధనల మేరకే లేఅవుట్లలో ఎటువంటి నిర్మాణాలనైనా చేపట్టాలని, అక్రమ నిర్మాణాలు చేపడితే తొలగించి వేస్తామని విజయనగరం కార్పొరేషన్ కమిషనర్ పల్లి నల్లనయ్య స్పష్టం చేశారు. బుధవారం నగరంలోని పావనీనగర్ లేవుట్‌లో అక్రమంగా చేపడుతున్న నిర్మాణంపై చర్యలు తీసుకున్నారు. ప్రణాళిక అధికారులు క్షేత్ర స్థాయి పర్యటనలో గుర్తించడంతో పాటు, అక్రమ నిర్మాణం జరుగుతున్నట్టు వచ్చిన ఫిర్యాదు మేరకు భవన నిర్మాణాన్ని తొలగించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో అక్రమ నిర్మాణాలు కట్టడాలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని స్పష్టం చేశారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం లేఅవుట్‌లో నిర్మాణాలు జరగాలని లేని పక్షంలో చర్యలు తప్పవని తెలిపారు.

11 ఇసుక ట్రాక్టర్ల పట్టివేత


తహసీల్దార్ కార్యాలయంలో ట్రాక్టర్లు

సాక్షి ఎఫెక్ట్

- ఒక్కొక్కరికీ రూ.20 వేలు జరిమానా
- విధుల పట్ల నిర్లక్ష్యం వహించిన వీఆర్వోలకు నోటీసులు
- సాక్షి కథనానికి స్పందించిన రెవెన్యూ అధికారులు

బొబ్బిలి: బొబ్బిలి రెవెన్యూ డివిజన్ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా అధికారులు వేగావతి నదిలో అక్రమంగా ఇసుకను తవ్వి తరలిస్తున్న 11 ట్రాక్టర్లను అడ్డుకుని తహసీల్దార్ కార్యాలయానికి తరలించారు. ఈనెల 15న సాక్షి దినపత్రికలో 'ఆగని ఇసుక దందా' శీర్షికన కథనం ప్రచురితమైంది. ఈ కథనానికి స్పందించిన అధికారులు రెండు రోజులుగా అనధికార ఇసుక రేవులపై నిఘా ఉంచారు. మండలంలోని వేగావతి నది పరీవాహక ప్రాంతాలైన పెంట, పారాది, అలజంగి గ్రామాలతో పాటు బాడంగి మండలం పాల్తేరు నుంచి కొన్ని ట్రాక్టర్లు ఆయా అనధికార ఇసుక రేవుల్లో భారీగా ఇసుకను తవ్వి తరలిస్తుండగా రెవెన్యూ అధికారులు బుధవారం దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో పట్టుబడిన 11 ట్రాక్టర్లను స్వాధీనం చేసుకున్నారు. వాస్తవానికి పేరుకు ఉచిత ఇసుక అంటూ వ్యాపారులే అక్రమంగా వాణిజ్య వ్యాపారాలకు ఇసుకను తరలిస్తున్నారు. పారాది వద్ద ఆర్ఐ‌ఓ రామ్మోహనరావు, అలజంగి వద్ద తహసీల్దార్ శ్రీను, పెంట వద్ద ఆర్ఐ రామకుమార్‌లు అక్రమ ఇసుక ట్రాక్టర్లను పలు దఫాలుగా గుర్తించి పట్టుకుని తహసీల్దార్ కార్యాలయానికి తరలించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ ఎం శ్రీను విలేకరులతో మాట్లాడుతూ మొదటి హెచ్చరికగా ఒక్కో ట్రాక్టర్‌కు రూ.20 వేలు చొప్పున జరిమానా విధించామన్నారు. మరో మారు అక్రమ ఇసుకతో దొరికితే వాహనాన్ని సీజ్ చేస్తామని హెచ్చరించారు.

సచివాలయ సిబ్బందికి నోటీసులు:

కాగా గ్రామాల్లో చట్టవ్యతిరేక కార్యకలాపాలు జరుగుతున్నప్పటికీ ఉన్నతాధికారుల దృష్టికి తీసురావడంలో అలసత్వం వహించిన అలజంగి, పెంట, పారాది గ్రామ సచివాలయాల వీఆర్ఓ, పంచాయతీ కార్యదర్శి, మహిళాపోలీస్‌కు షోకాజ్ నోటీసులు ఇస్తున్నట్లు తహసీల్దార్ తెలిపారు.

మైనింగ్‌శాఖ విజిలెన్స్ ఏం చేస్తున్నట్లు?

కాగా ఒక్క పూట రెవెన్యూ అధికారులు దృష్టిసారించి 11 అక్రమ ఇసుక ట్రాక్టర్లను పట్టుకుంటే మైనింగ్ శాఖలోని విజిలెన్స్ విభాగానికి కనీసం చీమకుట్టినట్లయినా లేకపోవడం విడ్డూరంగా ఉందని స్థానికంగా విమర్శలు వినిపిస్తున్నాయి. కొన్ని నెలలుగా అక్రమ గ్రావెల్, ఇసుక అక్రమ తవ్వకాలపై రెవెన్యూ శాఖ స్పందించినట్లు మైనింగ్ విజిలెన్స్ విభాగం కనీసం స్పందించలేదు. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక ఒక్క అక్రమ మైనింగ్ కేసును కూడా ఈ ప్రాంతంలో నమోదు చేయకపోవడంతో వారి పనితనం తెలుస్తోందన్న విమర్శలు అటు ప్రజల నుంచి ఇటు ఇతర శాఖల నుంచి వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా మైనింగ్ విజిలెన్స్ విభాగం దృష్టిసారించాలని పలువురు కోరుతున్నారు.

ఘనంగా విశ్వకర్మ జయంతి వేడుక


విశ్వకర్మ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న జేసీ యశ్వంత్ కుమార్ రెడ్డి తదితరులు

పార్వతీపురం: విశ్వకర్మ జయంతి వేడుకలను బుధవారం ఉదయం కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా కార్యక్రమంలో విశ్వకర్మ చిత్రపటానికి జాయింట్ కలెక్టర్ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ ప్రపంచపు తొలి వాస్తుశిల్పిగా, సృష్టికర్తగా విశ్వకర్మ పేరుగాంచారన్నారు. కృష్ణుడు పాలించిన ద్వారకానగరం వంటి పలు నగరాలు నిర్మించినట్లు పురాణాల్లో ఉన్నాయని పేర్కొన్నారు. ఈరోజు విశ్వకర్మలాంటి మహనీయుడిని స్మరించుకుని పూజించుకోవడం మన అదృష్టమన్నారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి కె.హేమలత, బీసీ సంక్షేమ శాఖ అధికారి అప్పన్న, విశ్వకర్మ సంఘాల నాయకులు, వివిధ శాఖల అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సృష్టికర్త, శిల్పకళా నిపుణుడు విశ్వకర్మ

విజయనగరం అర్బన్: నైపుణ్యం కలిగిన వృత్తి నిపుణులకు సమాజంలో ఎల్లప్పుడూ విశేష గౌరవం ఉంటుందని జాయింట్ కలెక్టర్ ఎస్.సేతు మాధవన్ పేర్కొన్నారు. విరాట్ విశ్వకర్మ జయంతి సందర్భంగా జిల్లా ప్రజలకు ఆయన హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఘనంగా జరిగిన విశ్వకర్మ జయంతి వేడుకలలో పాల్గొన్న జేసి ముందుగా విశ్వకర్మ చిత్రపటానికి పూలమాల నివాళులర్పించారు. కార్యక్రమంలో డీఆర్ఓ ఎస్.శ్రీనివాసమూర్తి, జిల్లా బీసీ సంక్షేమాధికారిణి జె.జ్యోతిశ్రీ, డీఆర్‌డీఏ పీడీ శ్రీనివాసరావు, వివిధ శాఖల అధికారులు, బీసీ సంక్షేమశాఖ అధికారులు, హాస్టల్ వార్డెన్లు, సిబ్బంది పాల్గొన్నారు.

విజయవంతమైన ఆటో కార్మికుల బంద్


ర్యాలీ నిర్వహిస్తున్న ఆటో, క్యాబ్ కార్మికులు

విజయనగరం టౌన్: రాష్ట్రప్రభుత్వం ఉచిత బస్సులను ప్రవేశపెట్టి ఆటో, క్యాబ్, టాటామ్యాజిక్‌లను నడుపుతూ పొట్టపోషణ చేసుకుంటున్న కార్మికుల పొట్ట కొట్టిందని, ఓ పక్క అధికారుల వేధింపులు, మరోపక్క కుటుంబ పోషణకు తీవ్ర ఇబ్బందులు తమను తీవ్రంగా కలిచివేస్తున్నాయని ఆటో కార్మికులు తమ నిరసన గళం విప్పారు. ఈ మేరకు బుధవారం ఆటో, క్యాబ్ డ్రైవర్లు ఆందోళన నిర్వహించారు. ఏఐఎఫ్‌టీయూ న్యూ, సీఐటీయూ, ఏఐటీయూసీల ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా చేపట్టిన బంద్ విజయవంతం చేశారు. కోట జంక్షన్ నుంచి బాలాజీ కూడలి, ఆర్‌టీసీ కాంప్లెక్స్ మీదుగా ర్యాలీ నిర్వహించి, నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఏఐఎఫ్‌టీయూ న్యూ రాష్ట్ర అధ్యక్షుడు గణేష్ పండా మాట్లాడుతూ జిల్లాలో వ్యవసాయ ఆధారిత పరిశ్రమలు మూతపడడంతో కార్మికులు చదివిన చదువుకు తగ్గ ఉద్యోగం దొరక్కపోవడంతో యువకులు, పండించిన పంటకు గిట్టుబాటు రాక రైతులు ఆటోడ్రైవర్లుగా మారారన్నారు. ఫైనాన్స్ కంపెనీల నుంచి లక్షల రూపాయలు అప్పుచేసి, వాటికి వడ్డీలు కడుతున్నారన్నారు. ఆటోస్పేర్ పార్ట్‌ల ధరలు రోజురోజుకు పెరిగిపోతున్నాయని, ఫిట్‌నెస్ టెస్టులను ప్రైవేట్ యాజమాన్యానికి అప్పగిస్తూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆటో, టాటామ్యాజిక్, క్యాబ్ వాహనకార్మికులపై అధికభారం మోపుతున్నాయని ధ్వజమెత్తారు. కూటమి నాయకులు తమకు ఓటువేస్తే ప్రతి డ్రైవర్‌కు ఏడాదికి రూ.15వేలు వాహన మిత్ర కింద ఇస్తామని, ప్రతి ఆటో డ్రైవర్‌కు 5శాతం వడ్డీతో రుణం ఇస్తామని, జీఓ నంబర్ 21ని రద్దుచేస్తామని, కార్మికుల సంక్షేమ సంఘాన్ని ఏర్పాటుచేస్తామని, పెట్రోల్, డీజిల్ రేట్లు తగ్గిస్తామని హామీ ఇచ్చారని, అధికారంలోకి వచ్చి ఏడాది దాటినా ఆటోకార్మికుల సమస్యలను పరిష్కరించకుండా గాలికి వదిలేశారని దుయ్యబట్టారు. దీనిపై కలెక్టర్‌కు పలుమార్లు విన్నవించినప్పటికీ ఎటువంటి ప్రయోజనం లేకపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి ఆటో కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

షరతులు లేకుండా వాహనమిత్ర అమలు చేయాలి

సీఐటీయూ రాష్ట్ర నాయకులు కె.రాజ్‌కుమార్, జిల్లా అధ్యక్షుడు కె.సురేష్, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు రంగరాజు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎటువంటి షరతులు లేకుండా లైసెన్స్ ఉన్న ప్రతి ఆటో,క్యాబ్ ఇతర వాహనరంగ కార్మికులకు వాహనమిత్ర అమలుచేయాలని, ఉచిత బస్సు పథకం వల్ల లన నష్టపోయిన డ్రైవర్లకు రూ. 25వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐఎఫ్‌టీయూ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రెడ్డి నారాయణరావు, జిల్లా అధ్యక్షుడు ఎస్.అప్పలరాజురెడ్డి, ఏఐటీయూసీ నాయకులు ఈశ్వరరావు, అప్పారావు, ఆటో, టాటా మ్యాజిక్ యూనియన్ నాయకులు పాపారావు, రామునాయుడు, అధిక సంఖ్యలో కార్మికులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆస్తులు అప్పగించడమే సంపద సృష్టా?

- మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను విరమించుకోవాలి
- రాష్ట్రంలో మెడికల్ కళాశాలల ఏర్పాటు ఘనత వైఎస్ జగన్‌దే
- ఎమ్మెల్సీ డాక్టర్ పీవీవీ సూర్యనారాయణరాజు


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ డాక్టర్ పెనుమత్స సురేష్ బాబు

నెల్లిమర్ల రూరల్: సంపద సృష్టి అంటే ప్రభుత్వ ఆస్తులను ప్రైవేటుకు ధారాదత్తం చేయడం కాదని ఎమ్మెల్సీ డాక్టర్ పెనుమత్స సూర్యనారాయణరాజు (సురేష్ బాబు) పేర్కొన్నారు. ఈ మేరకు నెల్లిమర్ల మండలంలోని మొయిద గ్రామంలో గల తన క్యాంపు కార్యాలయంలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రభుత్వ రంగంలో మెడికల్ కళాశాలల నిర్మాణ విషయంలో అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గొప్ప సంకల్పంతో ముందుకెళ్తే, ప్రస్తుత సీఎం చంద్రబాబు మాత్రం ప్రైవేట్ దళారులకు వాటిని కట్టబెట్టే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. ప్రైవేటీకరణ వల్ల పేద, మధ్య తరగతి విద్యార్థులకు వైద్యవిద్య అందుబాటులో లేకుండా పోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. అధికారం ఉందని, ఏది చేసినా చెల్లుబాటవుతుందనే ధోరణిని విడనాడాలని హితవు పలికారు. మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణపై అన్ని వర్గాల్లోనూ చర్చ జరగాలని ఆయన అభిలషించారు. 1923లో విశాఖ ఆంధ్రా మెడికల్ కాలేజీ మొదలుకుని 2024లో పాడేరులో పూర్తయిన మెడికల్ కాలేజీ నిర్మాణం వరకు ఒక్క కాలేజీని కూడా చంద్రబాబు తీసుకురాలేదని గుర్తు చేశారు. వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి హయాంలో జిల్లాల సంఖ్యను పెంచి ఒకేసారి 17 కొత్త వైద్య కళాశాలల నిర్మాణానికి శ్రీకారం చుట్టారన్నారు. విజయనగరం, రాజమహేంద్రవరం, ఏలూరు, మచిలీపట్నం, నంద్యాల మెడికల్ కళాశాలలు ప్రారంభమై తరగతులు కూడా మొదలు పెట్టినట్లు గుర్తుచేశారు. ఎన్నికలు వచ్చే నాటికి పాడేరు, పులివెందుల కాలేజీలు కూడా క్లాసులకు సిద్ధమయ్యాయన్నారు. ప్రజలకు మంచి జరిగితే చంద్రబాబు అండ్ కో తట్టుకోలేదని, అసలు మెడికల్ కళాశాలల నిర్మాణాలే జరగలేదని చెప్పడం సిగ్గుచేటన్నారు. ప్రజలకు వాస్తవాలన్నీ తెలుసునని ఎవరి హయాంలో ఎంత మంచి జరిగిందో ఇప్పుడిప్పుడే తెలుసుకుంటున్నారన్నారు. ప్రభుత్వం తక్షణమే తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు.

మండలిలో సమస్యలు ప్రస్తావిస్తా

గురువారం నుంచి శాసన మండలి సమావేశాలు ప్రారంభం కానున్నాయని, ప్రజా సమస్యలపై తన గళం వినిపిస్తానని ఎమ్మెల్సీ సురేష్ బాబు పేర్కొన్నారు. తారకరామతీర్థ సాగర్ ప్రాజెక్టు నిర్మాణంలో భూములు మునిగిపోయి, జీవనోపాధి కోల్పోయిన సారిపల్లి, కుదిపి, నీలంరాజుపేట గ్రామాల ప్రజలకు పీఏఎఫ్ ప్యాకేజీ ఇవ్వాలని గట్టిగా డిమాండ్ చేస్తానని చెప్పారు. ప్రాజెక్టు నిర్మాణంలో నిర్వాసితులైన కోరాడపేట, ఏటీ అగ్రహారం, పడాలపేట గ్రామ ప్రజలకు పునరావాస కల్పనపై ప్రశ్నిస్తానని ఎమ్మెల్సీ స్పష్టం చేశారు.